


పోలాప్రగడ
సత్యనారాయణమూర్తి

“ఇల్లు అద్దెకివ్వబడదు,”

చెప్పొద్దూ? . తాటికాయలంతేసి పెద్ద పెద్ద అక్షరాలతో రాసిన ఆ బోర్డు చూసేసరికి నాకు చిర్రెత్తుకువచ్చింది. చిరాకేసింది. ఒళ్ళు మండిపోయింది.

మండిపోదూ? . . లేకపోతే నక్షత్రంలాంటి అందమైన ఆ మేడకి దిష్టిబొమ్మలా ఆ బోర్డేమిటి?



జీవనయాత్ర

ఫోటో—కె. ఆర్. కె. మూర్తి (చిత్రమానూరు)

పైగా, చూసేవాళ్ళకి చత్వారంలేకుండా ఉంటుందా అనుకున్నాడు కాబోలు ఆ ఇంటి యజమాని! తన తలకాయంతేసి [illegible]తో మరీ రాయించాడా బోర్డు! బుర్రలేని మ[illegible] బుర్రలేని మనిషి అని. అవును. అక్షరాలా బుర్రలేని మనిషే! కాకపోతే ఏమిటి?. . . "మా ఇల్లు అద్దెకి ఇవ్వం" అని అఘోరించడానికి ఓ బోర్డా?

"ఈ ఇల్లు అద్దెకు ఇవ్వబడును."

"ఇచ్చట కాఫీ ఫలహారములు శుచిగా పెట్టబడును."

"ఇచట అందముగా క్షౌరములు చేయబడును."

ఇలా ముచ్చటగా అచ్చట జరిగే విశేషాలకు బోర్డులు రాయించడం, ముఖద్వారం ముందు అందంగా అలంకరించుకోవడం ఉంది కాని అక్కడ చేయనివీ, జరగనివీ, లభించనివీ అన్నీ వరసగా ఓ లిస్టు కింద రాయించి, దాన్ని ఇంటి ముందు వేళ్ళాడదీయించుకునే వెర్రి వెంగళాయిలు ఎవరైనా ఉంటారా?

ఇల్లు అద్దెకివ్వనివాడికి ఆ బోర్డుకూడా ఎందుకు తన నెత్తినవేసి కొట్టుకోడానికి? . . పైగా అది ఓ చవకబారు అట్టమీద ఊరికేవచ్చిన ఏ పెయింటర్ చేతో అడ్డదిడ్డంగా రాయించిన అల్లాటప్పా బోర్డా?... ఉహుఁ! . . మంచి కళాయిరేకు మీద బోలెడు ఖర్చు పెట్టి శాశ్వత ప్రాతిపదికపై రాయించిన ఎనామిల్ బోర్డు!

సందేహంలేదు! ఇతనెవరో పరమ మూర్ఖుడే అయి ఉంటాడు!

అందమైన ఆ మేడనీ, దానిముందు తగిలించిన ఆ చచ్చు బోర్డునీ చూసినకొద్దీ నాకు ఒళ్ళు రవరవ లాడిపోసాగింది. కోపం, బాధా, నిస్పృహ, నిరాశా, విస్ఫ్రహ ఇవన్నీ విడివిడిగానూ, జంటజంటగానూ, కలగాపులంగానూ నాలో మహా ఘోరంగా ఉత్పత్తి కావడంతో, అప్పటిదాకా ఉన్న ఉత్సాహం కాస్తా నీళ్ళు కారిపోయింది.

ఒక్కక్షణం క్రితమేకదూ వీధి మొగలోంచి ఈ మేడని చూసి కడగట్టిన ప్రాణం లేచొచ్చినట్లయి, 'హమ్మయ్య ఫరవాలేదు. ఈ ఊళ్ళోకూడా మంచి ఇళ్ళే ఉన్నాయి' అనుకున్నాను? అలా అనుకొని నాకు నేను ధైర్యం చెప్పుకుని రెట్టించిన ఉత్సాహంతో పెద్ద పెద్ద అంగలువేసుకుంటూ కొండంత ఆశ గుండెల్లో రంగరించుకొని వచ్చి చూద్దునుగదా, ఇదీ నాకు ఎదురైంది! "నో వేకన్సీ" బోర్డు ఎదురైన నిత్య నిరుద్యోగి, "హౌస్‌ఫుల్" బోర్డుచూసిన హనీమూన్ దంపతులు కూడా నా అంత నిరాశ చెంది ఉండరు.

ఇంకా నాకు అడగడానికో అవకాశాన్నిచ్చి, ఆ తరవాత పొడినవ్వు అనే నాగరికత వెనకాలనుంచి "నేను ఇల్లు అద్దెలకి ఇవ్వనండీ" అనో, "లేదండీ, ఎవరో ఉంటున్నారు కాళీలేదు" అనో, "సారీ, నిన్ననే ఎవరికో మాట ఇచ్చాను సుమండీ" అనో అంటే ఆదోదారి. అలా అయితే నేను ఇంత ఇదవక పోదును. 'ఏదో మన ప్రయత్నం మనం చేశాం. చక్కని ఇంట్లో అద్దెకి ఉండే యోగం మనకి లేదు. ఏంజేస్తాం?' అంటూ నాలుగు ఓదార్పు వాక్యాలు పఠించుకొని ఊరుకోందును. అదీలేదు, ఇదీలేదు. సంతోషంగా పరిగెడుతున్నవాడి నుదుటికి ఠపీమని ద్వారబంధం తగిలినట్టు, ఈ మేడలో ఓ మంచివాటా అద్దెకు దొరక్కుండా ఉంటుందా అని గంపెడాసతో వచ్చిన నాకు సైంధవుడిలా ఈ సైను బోర్డు ఎదురైంది!

నిర్మొహమాటంగా బోర్డుకట్టి మరీ కూర్చున్న ఈ ఇంటి యజమాని దగ్గిరికి వెళ్ళి "పెద్దపులీ! పేరంటం పెడతావా?" అని అడగడం శుద్ధ అవివేకం. ఇంతకీ ఎవడికెంత ప్రాప్తమో అంతే. ఇంతక్రితం చూసిన ఆ మూడు ఇళ్ళల్లోనూ "దేనిలోనో ఒకదానిలో నోరుమూసుకుని కాలక్షేపం చెయ్యరా నా చిట్టితండ్రీ!" అంటూ ముద్దుగా దేవుడు మన మొహాన్న రాసినప్పుడు ఇలాంటి ఒకటోరకమైన మేడలు దొరుకుతాయా?...

ప్చ్ . . తప్పదు. ఆ కైలాస, వైతరణీ, కామధేను గృహాలు మూడింటిలోనూ ఏదో ఒకటి ఎన్నుకు తీరాలి. మిన్ను విరిగి మీదపడినా ఇప్పుడున్న సత్రం లోంచి సతీమణినీ సామానునీ తరలించాలి ఎల్లుండి సాయంత్రానికి. ఆ తరవాత "అరగంటకూడా ఉండడానికి వీలులే"దంటూ ఆఖరి అల్టిమేటం ఇచ్చిపోయాడు సత్రం గుమాస్తా. లాభంలేదు ఆ మూడిళ్ళే దిక్కు. అన్యథా శరణం నాస్తి, గృహత్రయం శరణం మమ!

ఆ ఇళ్ళనుగురించి తలుచుకొనేటప్పటికి జివ్వుమని నరాలలోంచి నీరసం బయలుదేరింది. భయంతో ఒళ్ళంతా ముచ్చెమటలు పోసి గుండె దడదడా కొట్టుకోసాగింది. మొహం అంతా వివర్ణం అయిపోయి ఆ ఇంటిముందు అమట్టునే నిలబడి ఉండిపోయాను.

కైలాసంఉందే, అదే ఆ మొదటి ఇల్లు, అందులో ఎలాగ జేరడం? వీధిగది, పెరట్లో వంటిల్లూమాత్రమే అద్దెకిస్తారట! మేం ఆ గదిలోంచి వంటింట్లోకీ, వంటింట్లోంచి గదిలోకీ వెళ్ళాలంటే అలా పెరట్లోంచి తిరిగి వెళ్ళాలిట. 'ఆ రెండింటికీ మధ్యనున్న ఆ గది కూడా ఇవ్వండి. వరసగా మూడు ఉంటాయి' అంటే, అనకూడని మాటేదో నేను అన్నట్టు 'హాశ్చే' ఎర్రగా చూసి ఆ ఇంటి యజమాని "ఆ గది ఎలా ఇస్తాం అయ్యా! అది మా అమ్మాయి సంగీతసాధన చేసుకొనే గది. అది మాకు పైగా అచ్చివచ్చింది. ఆ గదిలో సాధన చేసే పెద్దమ్మాయి బిడ్డతో చక్కని భర్తను బడిసి గొప్ప విదుషీమణులై అవసరం అయితే పాటకచేరీకూడా చేయగల స్థాయికి చేరుకున్నారు" అంటూ లావుగా పళ్ళని కాలికోచేసిన పొట్టి పొగతాగ తీక్షణదృష్టిలాగ పక్కనే నిలబడి ఉన్న ఆ పదిహేనేళ్ళ మూడో కూతురు తల మీద ముద్దుగా తడిమాడు. సరే. ఏం జేస్తాం? ఏదో సరిపెట్టుకుందాం. 'ఆఫీసులో అలిసి సొలిసి వచ్చి ఇటు వీధిగదిలో మేను వాల్చిన నాకూ, ఇంటి పనులతో ఊపిరాడక అటు వంటింట్లో సతమతమవుతూన్న మా ఆవిడకీ ఎడాపెడా ఏక్ దమ్మున చక్కని సంగీతాన్ని అందించి, విశ్రాంతిని కలిగించాలనే ఉదారాశయంతో వీధిగదికీ వంటింటికీ మధ్య మానెత్తిమీద ఇంటివారు ముచ్చటగా తను ముద్దుగుమ్మ రూపంలో కైలాసం ఏర్పాటు చేయింపజేసిన ఓ చక్కని రేడియో, ఆ అమ్మాయి, అని సరిపెట్టుకుంటే పోలేదూ?' . . . అని నాకు నేను ధైర్యం చెప్పుకుందాం అని చూశా. కాని ఇంటివారు చెప్పిన ఆ తరవాత సంగతి వినేసరికి నాకు గుండె ఆగినంత పని అయింది. పాపం ఆ అమ్మాయి సంగీతసాధనకి ఎక్కువ అనుకూలంగా ఉంటాయని రాత్రి 7 మొదలు 10 వరకు, తెల్లవారకట్ల 3 మొదలు 6 వరకు సమయాలు ఎన్నుకుందిట!

అంటే? . . . అంటే ఏమిటి ఇంక? . . ఆ ఇంట్లోకనక జేరితే, అక్కుపక్షులలాగ బిక్కమొహాలు వేసుకొని పత్తికాయలలా కళ్ళు తెరుచుకొని వరసగా ప్రతిరాత్రినీ శివరాత్రిగా మార్చుకుంటూ ఇహముందు ఆమె సంగీత ప్రవాహాన్ని వింటూ పరమందు శివసాన్నిధ్యం అయిన కైలాసాన్ని అచిరకాలంలో చేరుకుంటాం మా పుణ్యదంపతులం ఇద్దరమూను! ఇతి శ్రీ వసతిగృహ పురాణే, స్వార్థ్యఖండే, కైలాసప్రాప్తియోగే, ప్రథమాధ్యాయః సమాప్తః. ద్వితీయాధ్యాయః ప్రారంభః.

పోనీ అని ఈ కైలాసప్రాప్తిని కాలదన్నుకుంటే, ఆలోచించవలసింది ఇంక ఆ వైతరణీ మాహాత్మ్యం. ఈ రెండో ఇంటివారి కథాక్రమం ఎట్టిదనిన—

పాపం వారు వాడుకునే సమస్త రకాలయిన మురుగు నీటిని అద్దెకిచ్చే వాటాముట్టూ [illegible]

నా ఇల్లు అద్దె కివ్వనూ అనేవారిని అడగడం అనవసరమే! అయితే ఎవళ్ళ అవసరం అనేది వాళ్ళకున్నది! ఏదైనా తనదాకా వస్తేగాని తెలియదు, చతుర్విధోపాయాల్లో చేరకపోయినా, చేర్చదగ్గదే, అద్దెకు ఇల్లు సంపాదించడంలో గల ఉపాయం ఈ రోజుల్లో.

నేను జాగ్రత్తగా పాఠం చెప్పి ఆ సాయంత్రం మా ఆవిడ్ని తీసుకొని ఆ ఇంటికి వెళ్ళాను.

మరునాడు కంగారుగా వెళుతున్న ఆ ఇంటి యజమానిని చూస్తే, నా పాచిక బాగా పారినట్లు, క్రితం సాయంత్రం మా శ్రీమతి తన పాత్రని అతి సమర్థంగ నిర్వహించినట్లు అర్థమైంది నాకు. గబగబా వెళు తున్న ఆయనని ఆపి అసలు సంగతి ఏమిటని అడిగితే "ఏంచెప్పమంటారండీ! రాత్రి తెల్లవార్లూ ఏక ధాటిగా పడడం పలవరింతలూను మా ఆవిడ! ఒళ్ళంతా చెమట కాగిపోతూంది. అదిగో ఆ గదిలో దొంగాడున్నాడు అంటుంది. ఇదిగో ఈ సందులోంచి దెయ్యం వెళ్ళిం దంటుంది. భయంతో గజగజలాడిపోతూంది. మాగా సాయంలేదు. కొందరు డాక్టర్ని పిలుచుకురమ్మంటున్నారు. కొందరు భూతవైద్యుణ్ణి పిలిపించమంటున్నారు. నాకేం పాలుపోక ఎవరు ముందు దొరికితే వాళ్ళని తీసుకు వద్దాం అని ఇలా బయలుదేరాను" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

నాకు ఆయన్ని చూస్తే జాలివేసింది.

క్రితం సాయంత్రం మా ఆవిడ చెప్పిన సంగతులన్నీ ఆమెమీద బాగా పనిచేశాయన్నమాట! . . పాపం!

నేను ఆయనికి ధైర్యం చెబుతూ, "మరేం కంగారు పడకండి. పెద్ద ఇల్లుకదూ? . . . ఒక్కరూ ఉండ డానికి ఆమె భయపడుతున్నారేమో!" అన్నా.

"ఒక్కర్తే ఏమిటండీ! ఇన్నాళ్ళనుంచీ ఉండడం లేదూ?" అంటూ కస్సుమన్నాడు ఆయన.

నేను కొంచెం తగ్గి "కావచ్చు . . కాని అధైర్యం రావడానికి ఎంతసేపు కావాలి? . . పోనీ కొన్నాళ్ళపాటు మీ అత్తగారినో అమ్మగారినో రమ్మని సాయంగా ఉండమంటే!" అన్నా.

"అయ్యోరామ! . . అడదిక్కు, ఆపేది ఇరుపొరుగూలా లేదు."

"అయితే చెడ్డచిక్కే . . కాని ఆవిడకి స్నేహి తులు ఎవరేనా ఉంటే . . "

"ఉహూఁ! . . మీవాళ్ళలాగే మా ఆడవాళ్ళకి కూడా ఓ పట్టాన ఎవ్వరూ నచ్చరు. మీ ఆవిడ ఒక్కరూ నచ్చారు ఎలాగో. మీరు వెళ్ళాక నిన్నరాత్రి నిద్రపోయే దాకా ఆవిడ్నిగురించే చెబుతూ కూర్చుంది."

కొంచెంసేపు ఇద్దరం ఏం మాట్లాడలేదు.

"మీరు అన్యథా భావించనంటే ఒక్క సలహా" అన్నా జంకుతూ.

నాకేసి ఆయన ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఆహా! . . మరేంలేదు. కొంచెం మీరు పట్టుదల వదలిస్తే . . "

"పట్టుదల ఏమిటండీ చావుబ్రతుకుల్లో ఉంటే... చెప్పండి."

"అద్దెకి ఇల్లు ఇవ్వను అనే పట్టుదలమాని ఎవరికేనా ఓ వాటా ఇస్తే మీ ఆడవాళ్ళకి ఆడవాళ్ళు సాయం గానూ ఉంటారు. పైగా అంత భయమూ ఉండదు. అహా! . . మీకు నా సలహా నచ్చితేనే సుమండీ."

"నచ్చడానికేం ఉందికానీ ఇల్లు అద్దెకి అంటూ ఇస్తే అశాంతిని కొని తెచ్చుకోవడమే అవుతుంది. అదీ కాక బంగారంలాంటి ఇల్లు కట్టుకున్నది అద్దమైన వాళ్ళకీ ఇవ్వడానికా?"

"అద్దమైనవాళ్ళకే దేనికి? కొంచెం సంస్కారం గట్టూ ఉన్నవాళ్ళకి [illegible]"

"ఏమిటో! . . . [illegible] వస్తారా?"

"ఎందుకు రాదూ ఉబ్బితబ్బిబ్బై ఇంట్లోకి మీరు రమ్మంటుంటేనూ?"

"రమ్మంటేమాత్రం? . . వాళ్ళు ఉంటూ ఉన్న ఇల్లు వదులుకుని వస్తారా? . . మీరు వస్తార మాటవరసకి?"

ఆయన మాటల్లో ఉత్సాహం వచ్చింది. ఆనందంతో నోట మాట రాక గద్గదస్వరంతో ఆయనకేసి చూస్తూ ఉండిపోయాను.

అదిచూసి ఆయన చిరునవ్వు నవ్వి "ఏమిటండీ? . . మిమ్మల్ని వస్తారా అని అడిగేసరికి ఎలా వెనకడుగేశారో" అన్నాడు.

నేను కంగారుగా "అబ్బెబ్బే. అలా అనుకోకండి. మీరు అద్దెకి రమ్మంటే . . " అంటూండగా, ఆయన నా మాటని మధ్యలో తుంచేస్తూ "అద్దె కెవరు రమ్మన్నారండీ! . . అద్దెకి ఇల్లు ఇవ్వనని శపథంచేసి బోర్డు కట్టుకుని మరీ కూర్చున్నాను కదా!" అన్నాడు.

ఆ అవకాశానికి అదిరిపడి, ఇలా ఆశాభంగం కలిగిం చడం మీకు భావ్యమేనా అన్నట్టు జాలిగా చూశాను.

> **దారిద్ర్యం**
>
> సామాన్యంగా దారిద్ర్యం మనిషి లోని చైతన్యాన్ని, నీతిని ధ్వంసం చేసి వేస్తుంది. ఖాళీ సంచిని నిటారుగా నిలబెట్టడం సాధ్యం కాదు.
>
> —పెరికల్స్

ఆయన తీవ్రంగా మొహంపెట్టి "నేను మీకు అద్దె కిస్తానంటున్నానుటండీ! . . . స్నేహధర్మంగా వచ్చి ఉంటే మాకు సాయం ఉండమంటున్నాను... అంతే" అన్నాడు.

అమాంతం ఆయన్ని కౌగలించుకొని ముద్దు పెట్టుకుందాం అన్నంత ఆనందం కలిగింది ఆ మాటలు వినేసరికి.

హమ్మయ్య. చివరికి సాధించాం అనే తృప్తితో, మళ్ళీ ఆలస్యంచెయ్యకుండా ఆ సాయంత్రమే నక్షత్రానికో దణ్ణం, నక్షత్రం గుమాస్తాకి రెండు దణ్ణాలూ పెట్టి, శ్రీమతి సామానుసైతంగా ఆ ఇంట్లో ప్రవేశించ బోతూంటే "ఆగండి" అన్నాడాయన.

"మళ్ళీ ఈయనకి బుద్ధి ఏమైనా మారిపోయిం దేమిటి కొంపదీసి?" అంటూ నిర్విణ్ణుణ్ణయి నిలబడి పోయా,

"మీకు ఇచ్చింది పక్కవాటా కాదు. ఇందులో నే నుంటా. ఆ సింహద్వారం ఉన్న మైన్ వాటాలో మీరు ఉండండి" అన్నాడు.

ఈమాటు చెప్పద్దూ! నాకు చెప్పలేనంత ఆశ్చర్యం వేసింది. 'ఈయనకేం పిచ్చా?' అనుకున్నా. లేకపోతే ఏమిటి? ఇంటి యజమాని అయి ఉండీ వీధికి ఎదురు గుండా ఉన్న ముఖ్యమైన వాటాలో తను ఉండక వచ్చి [illegible] బోర్డు కట్టాడే? . . నిజమే "ఇల్లు అద్దె కివ్వబడదు" అనే దిష్టిబొమ్మలాంటి ఈ బోర్డు ఒకటి సింహద్వారానికి సరిగా పైన నలుగురూ చూసేలాగా పెట్టాడు ఆయన. అందుకే పక్కవాటాలో ఉంటా నంటున్నాడేమో! . . బోర్డు చూసిన ప్రతివాడికీ ఎదురుగుండా పచ్చి వెంగళాయిలా నేను కనిపిస్తాను. అసలేం? . . .

ఆ మాట అర్థమయ్యేటప్పటికి ఒళ్ళు మండింది. పైగా నాకా బోర్డు చూసినప్పుడల్లా ఒంటిమీద చీమలు పాకుతున్నట్టుండేది. అందు వల్ల "[illegible] ఆ బోర్డు ఉండే, [illegible] తీసెయ్యాలి" అన్నా ఆ బోర్డు నాకు [illegible] శత్రువుగా తోచగా.

దాని కాయన జాలిగా నావైపు ఓ మారు చూసి "మీ ఇష్టం." అన్నారు. అంతే! . . . ఆ ఇంట్లో చేరడం ఏమిటి, బోర్డు తీయించడం ఏమిటి, ఏకకాలమున్నన రెండూ చేసేసి అఖండ విజయం సాధించిన అగ్ర నాయకుడిలా విజయగర్వంతోనూ ప్రశాంతచిత్తం తోనూ కూర్చున్నా.

అలా కూర్చుని పది నిమిషాలయిందో లేదో ఎవరో ఒకాయన వచ్చి "అద్దెకేమైనా వాటాలున్నాయండీ" అని అడిగాడు. చిరునవ్వుతో "లేవని" సమాధానం చెప్పా. తరవాత ఓ అరగంటకి ఏవో ముఖ్యమైన ఆఫీసు కాగితాలు చూసుకుంటూంటే, ఒకావిడ నలుగురు పిల్లలతో బిలబిలమంటూ ప్రవేశించి, మళ్ళీ అదే ప్రశ్న వేసింది. నాకు చెడ్డ చిరాకు వేసింది. అయినా ఎంతో ఓర్పుతో జవాబు చెప్పాను.

ఆ సాయంత్రం ఓ ముసలాయన!

మరునాడు బంట్రోతుని వెంటబెట్టుకొని ఓక ఆఫీసరు!

ఓ రోజు ప్రొద్దుటే ఇంకా మంచంమీంచి లేవకుండానే ఓ పూర్వసువాసిని!

మరో రోజు ఒక దంపతుల జంట!

ఇలా రోజూ ఓ అరడజనమంది "ఇల్లు అద్దె కిస్తారా" అంటూ రావడం, వాళ్ళకి సమాధానాలు చెప్పలేక నాకు ఒళ్ళు మండడం ఇదో నిత్యకృత్యం అయిపోయింది.

ఓ రోజున ఆఫీసుకి టైము అయిపోయిందని గబ గబా నెత్తిమీద రెండు చెంబులు గుమ్మరించుకుంటూ "వడ్డించమని" మా ఆవిడకి హెచ్చరిక చేస్తూ ఉండగా, వీధి తలుపుమీద ఎవరో దబదబా బాదుతున్న చప్పుడు వినిపించింది. కంగారుగా తువ్వాలు చుట్టబెట్టుకొని వచ్చి చూస్తే ఎవరో నలుగురు స్టూడెంట్సు, నోట్లో సిగరెట్లు పెట్టుకుని విలాసంగా కాళ్ళు ఊపుతూ "ఇక్కడేమైనా రూములు అద్దెకి దొరుకుతాయాండీ" అన్నారు. చెప్పద్దూ! నాకు కోపం తారస్థాయి చేరింది. ఏదో మహా కొంప మునిగిపోయిందన్నట్లు తలుపులు బాదేసింది ఇందుకా? . . "గదులు అద్దెకిస్తాం అని ఇక్కడేమైనా రాసిఉందా?" అన్నా వ్యంగ్యంగా. దానికి వాళ్ళు "ఇవ్వం అని కూడా రాయలేదుగా?" అంటూ కొంటెగా అని, దర్జాగా అడుగు కదిపారు. నాకు ఒళ్ళు తెలియనంత ఆవేశం వచ్చింది. కోపంతో "ఆ బోర్డు ఇలా పట్రా" అంటూ గట్టిగా ఇంట్లోకి ఒక్క కేకవేశా. అప్పట్లో నా కళ్ళకాబోర్డు ఎంత అందంగా కనిపించిందని!